క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్రజలు దోమకాటుకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నల్లకాలువ గ్రామంలో మలేరియా నివారణ చర్యల్లో భాగంగా బుధవారం యాంటీ లార్వా యాక్టివిటిస్ చేపట్టారు. ఇందులో భాగంగా మురుగు కాలువలు, నీరు నిల్వవున్న లోతట్టు ప్రాంతాల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించడం వల్ల మలేరియా వ్యాధిని నివారించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను అమరుస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల గ్రామం వద్దనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం అధికారులు నూతనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చినట్లు గ్రామ సర్పంచు కొంగర నవీన్‌కుమార్ తెలిపారు.. ఆయన మాట్లాడుతూ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలో లోఓల్టేజీ సమస్య పరిష్కారం కావడమే కాకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఉమాపతి, ఏడీ శ్రీనివాసరావు, ఏఈ రాంనాయక్, సబ్ స్టేషన్ సిబ్బంది, గ్రామస్థులు రంగస్వామి, సీపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

రాధక్క సేవలు మరవలేనివి



రాధక్క చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ నాయకులు

నందికొట్కూరు: గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధురాలు రాధక్క అలియాస్ అక్కినేని నిర్మల సేవలు మరవలేనివని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, నాయకులు నరసింహులు అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన రాధక్క ఏడాది నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బుధవారం ప్రాణాలు వదిలేయడం చాలా బాధకరమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అరుణ్‌కుమార్, గోపాల్, శివ, గోవిందు, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఏపీఓ రేష్మ

కొత్తపల్లి: రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి, సాగు చేసుకునేలా చూడాలని ఏపీఓ రేష్మ సూచించారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలోని ఫీల్డ్ అసిస్టెంట్లు వారి గ్రామాల పరిధిలోని రైతులకు ఉద్యాన పంటల సాగువల్ల కలిగే లాభాలు తెలియజేసి సాగుచేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇప్పటివరకు 154 ఎకరాలను గుర్తించామని చెప్పారు. ఇంకా ఎవరైనా ఆసక్తిగా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కుమారస్వామికి షష్ఠి పూజలు



పూజలందుకుంటున్న కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో బుధవారం షష్ఠి సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్ర పారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు

- ముందస్తుగా కురిసిన వర్షాలు
- వర్షాలకు పదునెక్కిన పొలాలు
- విత్తు పనుల్లో రైతన్నలు బిజీ
- 36వేల హెక్టార్లలో పంటల సాగు



నందికొట్కూరు సమీపంలో ట్రాక్టర్‌తో భూమిలో మందు వేస్తున్న రైతు



పాములపాడు వద్ద పొలంలో మొలకెత్తిన మొక్కజొన్న

నందికొట్కూరు: ప్రస్తుతం నియోజకవర్గంలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో వ్యవసాయ జాతర మొదలైంది. వాతావరణంలో పరిస్థితులు అనుకూలించడంతో అన్నదాతల్లో ఖరీఫ్ జోష్ కనిపిస్తోంది. సాగు పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురవడం, పొలాలు అదనుగా మారడంతో ప్రస్తుతం విత్తు పనుల్లో రైతన్నలు నిమగ్నమయ్యారు.

అత్యధికంగా మొక్కజొన్న సాగు..

నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల, మిడుతూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో ఈ ఏడాది ముందుస్తుగా వర్షాలు కురిసాయి. జూన్ నెల సాధారణ వర్షపాతం 85.88 మిల్లీమీటర్లు కాగా.. ఇప్పటికే అంతకు మించిన వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో అన్నదాతలు కోటి ఆశలతో ఖరీఫ్ పనులకు రైతులు శ్రీకారం చుట్టారు, నియోజకవర్గంలో సుమారు 36 వేల హెక్టార్లలో వివిధ రకాల సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో అత్యధికంగా 25 వేల హెక్టార్లల్లో మొక్కజొన్న, వరి 6వేల హెక్టార్లు, పత్తి 2వేల హెక్టార్లు, మినుము 500 హెక్టార్లు, మిగతా ఇతర పంటలను సాగు చేయనున్నారు. ఈ మేరకు రైతులు విత్తనాలు వేస్తున్నారు. ఇదిలా ఉండగా ముందస్తుగా వేసిన విత్తనాలు ప్రస్తుత వర్షాలకు మొలలొచ్చాయి.

ముందస్తుగా వర్షాలు కురిశాయి



ముందస్తుగా వర్షాలు కురిశాయి. ఖరీఫ్ పంటలను సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. చంద్రబాబు పాలనలో పంటలు పండుతాయో లేదో అనే భయం ఉంది. దేవుడి మీద భారం వేసి పంటలను సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నాం. ప్రస్తుతం 10 ఎకరాల్లో ఉల్లి, 3 ఎకరాలు మొక్కజొన్న, 8 ఎకరాలు పండు మిరపను సాగు చేసేందుకు సిద్ధమయ్యా.

– మల్లేశ్వరరెడ్డి, రైతు, మిడుతూరు

సమృద్ధిగా వర్షాలు



వర్షాలు సమృద్ధిగా కురవడంతో విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నాను. ముందస్తుగా వర్షాలు కురవడంతో ఈ ఏడాది పంటలు బాగా వస్తాయనే భావిస్తున్నాం. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో 5 ఎకరాల్లో మొక్కజొన్న మరో ఐదు ఎకరాలు కంది పంట సాగు చేస్తున్నాం.

– కాంతారెడ్డి, 10 బొల్లవరం

పాములపాడులో 20.4మిల్లీ మీటర్ల వర్షపాతం

పాములపాడు: మండలంలో బుధవారం 20.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ప్రతి రోజూ వర్షం కురవడం మంచిదే అయినా కొంత మంది రైతులకు ఇబ్బందిగా మారింది. పొలాల్లో విత్తనాలు వేయడానికి సాధ్యంకావడం లేదని వాపోతున్నారు. రెండు రోజులు వర్షం కురవకపోతే సజావుగా విత్తనాలు వేసుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇప్పటికే విత్తిన పొలాల్లో మొలకలొచ్చాయి. వాటికి ఈ వర్షం చాలా మేలని మరి కొందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బండలాగుడు పోటీల విజేత పెద్దకందుకూరు ఎద్దులు

చాగలమర్రి: స్థానిక చెరువు కట్టపై వెలసిన శ్రీదస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా బుధవారం ఒంటెద్దు రాతి దూలం లాగుడు పోటీలను దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో 22 వృషభాలు పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన మొదటి 8 ఎద్దులకు దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన ఎద్దుకు రూ. 10వేలు, రెండో బహుమతిని ఎద్దు యజమానికి రూ.8వేలు, ఆ తరువాత వరుసగా.. మైదుకూరు, కడప, ప్రొద్దుటూరు తదితర ఎద్దులకు రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2,500, రూ.2వేలు, రూ.వెయ్యిని మాజీ సర్పంచ్ అన్సర్‌బాషా, నిర్వాహకులు ముల్లా మౌలాలి, హనీఫ్ అందజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మహానంది: నంద్యాల– గిద్దలూరు మార్గంలోని సీతారామాపురం గ్రామ సమీపంలో కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గాజులపల్లె చెంచుగూడెంకు చెందిన నాగులు (22) అనే మహిళ దుర్మరణం చెందారు. స్కూటర్‌పై భర్త బాబు, ఇద్దరు పిల్లల తో కలిసి నంద్యాల నుంచి ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఆమె పిల్లలు, భర్తకు కూడా స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని చేరుకొని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

ఆత్మకూరు: కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉండి, అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. మనోధైర్యంతో మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అధికార పార్టీ చేసే ఒడిదుడుకులను, లోటుపాట్లను గుర్తించి ప్రజల ముందుకు తీసుకెళ్లి తిరిగి వారి నమ్మకం పొందాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇటీవల పలుచోట్ల టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, అది కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని, ప్రతిఘటన చేయడం కంటే సామరస్యంగా మెలగడం ఉత్తమమన్నారు. ప్రతి కార్యకర్తకు తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా కార్యకర్తల వద్దకు వచ్చి వారికి మనోధైర్యాన్ని కల్పిస్తామని భరోసా నిచ్చారు. ఓటమిని గెలుపుగా తీసుకొని ప్రతి కార్యకర్త ముందుకెళ్లాలన్నారు. ఆత్మకూరు మండలంలో పార్టీకి మంచి మెజార్టీ వచ్చిందని, ఇక్కడి ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. ప్రజల తీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

పట్టణంలోని నూతన షాదీఖానా భవనంలో అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించిన శిలా ఫలకాన్ని టీడీపీకి చెందిన కార్యకర్తలు యూనుస్, ఖవ్వబాషాతో పాటు మరికొందరు ధ్వంసం చేసి, అందుకు సంబంధించి సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారని భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ విషయంపై పట్టణ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ మీర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి శిలాఫలకాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సయ్యద్ మీర్, న్యాయవాది సుధాకర్‌రెడ్డి, వెంకటస్వామి గౌడ్, అంజాద్‌అలీ, రవినాయక్, చాంద్‌బాషా, మురళీధర్‌రెడ్డి, ఇందిరేశ్వరం సర్పంచ్ నారాయణ రెడ్డి, రాజు, దర్గమ్మ, పార్వతి, షఫీఉల్, మరియమ్మ, జెడ్.శ్రీనివాసరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ బాలస్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల తరలింపు



పగిడ్యాలలో పుస్తకాలు తరలించే వాహనాలకు పచ్చజెండా ఊపుతున్న అధికారులు

పగిడ్యాల: ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో స్థానిక ఆదర్శ పాఠశాలలో నిల్వ చేసిన పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం కిట్లను బుధవారం ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రత్యేక వాహనాలలో ఆయా స్కూళ్లకు తరలించారు. ఎంఈఓ సుభాన్ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి 1 నుంచి 10, ఇంటర్మీడియెట్ వరకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం కిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మండలంలోని 20 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 4 జిల్లాపరిషత్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో సుమారు 3,500 మందికి పైగా విద్యార్థులు చేరే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే విద్యాశాఖ కార్యాలయానికి 20 వేల పాఠ్యపుస్తకాలు, 23 వేల నోట్ పుస్తకాలు, యూనిఫాం కిట్లు పెట్టిన ఇండెంట్ ప్రకారం విడతల వారీగా వచ్చాయన్నారు. వాటిని పాఠశాలలకు తరలిస్తున్నామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ అరుణకుమారి, సీఆర్‌పీలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

పాములపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం పాఠ్యపుస్తకాలు చేర్చినట్లు ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానుందున 1 నుంచి 7వ తరగతి వరకు 16,000 పుస్తకాలు దాదాపు 80శాతం వచ్చాయని చెప్పారు. 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 100శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయని, వాటిని ఇప్పటికే అన్ని పాఠశాలలకు పంపించామని తెలిపారు. పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు 25,000 పంపించినట్లు వివరించారు. మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో 4,216 మంది విద్యార్థులున్నారన్నారు.

కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు



ముసుగు తొలగని వైఎస్సార్ విగ్రహం

ఆత్మకూరురూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కాలంలో నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగడం పరిపాటి. అయితే అధికారులు కోడ్ ముగియగానే ముసుగులు తొలగించేవారు. ఈసారి ఎందుకో అధికారులు ముసుగులు తొలగించడానికి బద్ధకిస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో నంద్యాల టర్నింగ్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి బుధవారం సాయంత్రం వరకు కూడా ముసుకు తొలగలేదు. ఎన్నికల కోడ్ ఈనెల ఆరవ తేదితో ముగిసినప్పటికీ అధికారులు ఎందుకో ముసుగు తొలగించడానికి ఇచ్ఛగించడం లేదు. ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌ను ఈ విషయమై వివరణ కోరగా 'అలాగా మనుషులను పంపిస్తా .. తొలగించమని చెబుతా ' అంటూ సమాధానమిచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో విగ్రహం దిమ్మెను ఒక లారీ ఢీకొనడంతో విగ్రహం ఒరిగింది. ఈ విషయమై ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ప్రమాదానికి కారణమైన లారీ వివరాలు తెలిసినప్పటికీ పోలీసులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

బడికి వేళాయె



మిడుతూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్

నందికొట్కూరు: ఆట పాటలకు ఇక సెలవు. వేసవి సెలవులను ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపిన పిల్లల వీపుపై గురువారం నుంచి మళ్లీ పుస్తకాల మోత పడనుంది. ఇన్నాళ్లూ 6 గంటల తరువాత నిద్ర లేచి అమ్మ ఇప్పుడు వేకుజామునే మేల్కొవాలి. పిల్లలకు స్నానం చేయించి, టిఫిన్ భోజనం వండీ క్యారియర్లల్లో సర్దాలి. అనంతరం ముస్తాబు చేసి బడికి పంపాలి. నాన్న వారిని వాహనంపై ఎక్కించుకుని హడవుడిగా బడి వద్ద దింపి రావాలి. దాదాపు 50 రోజుల పాటు ఆగిపోయిన ఈ హడావుడి నేటి నుంచి మళ్లీ ప్రారంభం కానుంది. గురువారం నుంచి నందికొట్కూరు నియోజకవర్గంలో పాఠశాలలు తెరచుకుంటున్నా.. ఇప్పటికి కనీసం 75 శాతం పుస్తకాలు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది, మిగత పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉంది. నందికొట్కూరు పట్టణ, మండలంలో–60, పగిడ్యాల మండలం –26, మిడుతూరు మండలం–45, జూపాడుబంగ్లా మండలం–35, పాములపాడు మండలం–41, కొత్తపల్లి మండలం–42 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. మొత్తం విద్యార్థుల సంఖ్య–37,745 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.



ఆకాశంలో కమ్మేసిన కారుమబ్బు

జోరు వాన



గువ్వలకుంట్ల ఎస్సీకాలనీలో నిలిచిన వర్షపు నీరు

కొత్తపల్లి: ఓవైపు ఆకాశాన్ని కారుమబ్బు కమ్మేసింది. మరోవైపు జోరువానలు కురుస్తున్నాయి. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటపొలాల్లో వర్షపునీరు చేరుతోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు మండలంలో జోరువాన కురిసింది. దీంతో గ్రామాలలోని పలుకాలనీల్లో వర్షపునీరు చేరి జలమయమయ్యాయి. ఓ వైపు ఆకాశంలో ముసురుకొని ఉండటంతో ఇంకెన్ని రోజులు వర్షం పడుతుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షం ఎప్పుడు తగ్గుతుంది ఎప్పుడు విత్తనాలు వేసుకోవాల అన్న ఆశతో వేచి చూస్తున్నారు.

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

నందికొట్కూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునః ప్రారంభం కానున్నట్లు మండల విద్యాశాఖ అధికారిణి ఫైజున్నిసా బేగం బుధవారం తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదయం 9గంటలకు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్తులపై ప్రత్యేక దృష్టి

పగిడ్యాల: 2024 ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయ భవనాలు, యూనివర్సిటీలు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలపై విచక్షణారహితంగా భౌతిక దాడులకు పాల్పడి విధ్వంసం సృష్టిస్తున్న సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్తులు విధ్వంసానికి గురికాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయ భవనాలను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు రావడంతో పోలీస్ శాఖకు లెటర్ పెట్టామని, వీఆర్వోలకు నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు.

అందుబాటులో కాంప్లెక్స్ ఎరువులు

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలోని ఆర్‌బీకేలలో రైతులకు కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 11 ఆర్బీకేలు ఉన్నాయన్నారు. అందులో గువ్వలకుంట్ల, నందికుంట, ముసలిమడుగు గ్రామాల ఆర్బీకేలలో కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గువ్వలకుంట్లలో డీఏపీ 10 టన్నులు, నందికుంటలో 10–26– 26 10.35 టన్నులు, 20– 20– 013 0.85 టన్నులు, ముసలిమడుగులో డీఏపీ 10 టన్నులు, 10– 26– 26 1.45 టన్నుల ఎరువుల వచ్చాయన్నారు. మిగత ఆర్బీకేలకు కూడా త్వరలో ఎరువులు వస్తాయని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు.

మహానందిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మహానంది : మహానందీశ్వరుడి సన్నిధిలో పల్నాడు జిల్లాకు చెందిన వీరభద్ర భజనమండలి కళాకారులు బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కాకాని అంజయ్య ఆధ్వర్యంలో కళాకారులు భజనలు చేశారు. ఓం నమఃశివాయ, హరహర మహాదేవ లాంటి ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ నిర్వహించిన భజన ప్రదర్శన భక్తులకు ఆధ్యాత్మిక ఆనందానికి గురిచేసింది.

ప్రభాకర్ రెడ్డికి కుప్పం రెడ్డమ్మ అవార్డు



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, రచయిత కాశీపురం ప్రభాకర్ రెడ్డికి కుప్పం రెడ్డెమ్మ స్మారక రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ప్రభాకర్ రెడ్డి రాసిన 'మేడం. సి' అనే నవలకు గాను అవార్డు అందజేశారు. బుధవారం చిత్తూరులో చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెడ్డమ్మ ట్రస్ట్ అధ్యక్షురాలు డా కె. రామలక్ష్మి అవార్డును అందజేసి సత్కరించారు. క్రికెట్ నేపథ్యంలో వచ్చిన ఈ నవలలో రాయలసీమ సంస్కృతి గొప్పదనాన్ని అద్భుతంగా వివరించారని వక్తలు పేర్కొన్నారు.

బాలలతో పని చేయిస్తే శిక్ష తప్పదు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: బాలలతో పనులు చేయిస్తే కఠిన శిక్షలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్ జడ్జి వీ దివ్య హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని కోర్టు ఛాంబర్‌లో స్ట్రీట్ చిల్డ్రన్స్ డే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తించి కుటుంబానికి అప్పగించడం జరుగుతుందన్నారు. బడి బయట ఉండే పిల్లలను బడిలో, చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. జూన్ నెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. సివిల్, క్రిమినల్, కంపౌండబుల్ ఎక్సైజ్, మున్సిపాలిటీ కేసులను ఇందులో పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు, సభ్యులు రఘునాథరెడ్డి, రహంతుల్లా, వెంకటేశ్వర్లు, కేశాలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన



ఉద్యోగులకు మెగా చెక్కును అందజేస్తున్న డిపో మేనేజర్ మహేంద్రుడు

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మహేంద్రుడు డిపోలో మే నెలలో 85 ఓఆర్ సాధించి, రాష్ట్రంలో మూడో స్థానం, జోన్‌లో ప్రథమ స్థానం సాధించినందుకు గానూ ఉద్యోగులందరినీ అభినందించారు. మే నెలలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్‌లు కె.గోవిందయ్య, జి.ఆర్.ఎల్. రెడ్డి, ఎంఎం బాషా, ఎస్.ముర్తుజాబీ, ఎస్.ఎన్.బాషా, కె.ఎస్.రావు, పి.మహేశ్వరి, జి.సి.నాగమ్మలను, అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు పి.దర్గయ్య, ఎస్.కె.వలి, ఎం.ఎస్.నాయక్, బీఎండీ రఫీక్, పీఆర్‌సీ రెడ్డి, ఎం.కలిముల్లాలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐ కోటయ్యనాయక్, కంట్రోలర్ ఎం.ఎం.బాషా, షఫీవుల్లా, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

చెత్తకుండీలను తొలగించాలి



కేజీ రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

ఆత్మకూరు: పట్టణంలోని కేజీ రహదారి వెంట చెత్తకుండీల్ల చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని, ఆ కుండీలను వెంటనే తొలగించి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రముఖ సామాజికవేత్త జవహర్ నాయక్ అధికారులను కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గౌడ్‌సెంటర్‌లో చెత్త వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేజీ రహదారి పక్కన ఉన్న కుండీల్లో చెత్త పేరుకుపోయి ప్రతిరోజూ కురుస్తున్న వర్షానికి కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని చెప్పారు. కుక్కలు అక్కడ స్వైర్యవిహారం చేస్తున్నాయన్నారు. ఆ దుర్వాసనతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈగలు, దోమలు చేరడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వెంటనే చెత్తను తొలగించి కేజీ రహదారికి దూరంలో చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.